# గురు'దేఖో'భవ !

బాలల్ని బాధ్యతాయుతమైన భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన దేవాలయాలైన విద్యాలయాల్లో అదొకటి.

అక్కడ -

"శేష సిద్ధాంతం చెప్పరా?" టెన్త్‌క్లాస్‌లో ఓ విద్యార్థిని లేపి అడిగాడు లెక్కల మాస్టారు రామ్మూర్తి.

"అదింకా మీరు చెప్పలేదు సార్!" నిలబడి భయం భయంగా చెప్పాడా కుర్రాడు.

"వెధవా! క్లాస్ ఎగ్గొట్టి వుంటావు. పైగా ఎదురు తిరిగి నన్నే చెప్పలేదంటావా?" అంటూ చితకబాదాడు.

ఏడుస్తూ కూచున్నాడు వాడు.

"నిజమే సార్! స్కూల్లో ఆ సిద్ధాంతం చెప్పలేదింకా. మాకు మాత్రం

ట్యూషన్‌లో చెప్పారు" మరో కుర్రాడు లేచి చెప్పాడు బితుకు బితుకుమంటూ.

"చాల్చాలు కూర్చో" అంటూ ఆ రెండో కుర్రాడ్ని కసురుకొన్నాడు.

"మరి ట్యూషన్‌కి వచ్చి తగలడొచ్చుకదా! స్కూల్లో మాత్రమే విని పాసవ్వాలని వెధవాశ" అంటూ మొదటి కుర్రాడ్ని ఈసడించుకున్నాడు.

***

"సార్! మీరు ఆదివారం రోజున మా ఇంటికి సతీసమేతంగా భోజనానికి తప్పకుండా రావాలి" హెడ్మాస్టర్ గదిలో ఎవరూ లేకుండా చూసి ఆయన్ని ఆహ్వానించాడు రామ్మూర్తి.

"ఏమిటీ విషయం?" అడిగాడాయన.

"మరేం లేదండి! టైమ్‌టేబుల్‌లో ఎనిమిదో తరగతి మాథ్స్ మాత్రం నాకు ఎలాట్ చేయకండి"

"మరెవరికి వేయాలా క్లాస్?"

"కొత్తగా వచ్చాడుగా ఆ బ్రహ్మానికి వేయండి" అన్నాడు రామ్మూర్తి.

"అది సరే, ఇంతకి నీకెందుకు వద్దంటున్నావ్?"

"ఎనిమిదో తరగతి టెక్స్ట్‌బుక్ మారిందిగా. గైడ్స్ రిలీజ్ అయ్యాయో లేవో..." అంటూ మెల్లిగా గొణిగాడు.

"ఆ(...ఆ(... అర్థమైంది" అంటూ నర్మగర్భంగా నవ్వాడాయన.

***

ఓ కుర్రాడిని స్టాఫ్ రూమ్‌కి పిల్చి-

"ఒరేయ్! ఈ లిస్ట్‌లోని సరుకుల్ని కొని ఇంట్లో అమ్మగారికి ఇచ్చిరా" చెప్పాడు రామ్మూర్తి.

"సైన్స్ లెస్సన్ అవుతోంది సార్! నెక్స్ట్ పీరియడ్ ఇంగ్లీష్ వుంది. లెస్సన్స్ మిస్ అవుతాను. సాయంత్రం స్కూల్ అయిపోగానే తెచ్చిస్తా" అభ్యర్థనగా అన్నాడా కుర్రాడు.

"నువ్వు పాఠాలు వినకపోతే స్టేట్ ర్యాంక్ మిస్సవదుగానీ... వెధవా! వెళ్లి చెప్పిన పని చెయ్" అంటూ విసుక్కున్నాడు.

**'మీరు చెప్పే పనులు చేస్తూ గనుక కూచుంటే స్టేట్ ర్యాంకేం ఖర్మ.**

పాసవుతేనే మా గొప్ప' మనసులో అనుకున్నాడా కుర్రాడు.

***

"సార్! ఈసారి టెన్త్ బ్యాచ్ పూర్‌గా వుంది. ఎంత చెప్పినా పిల్లల మెదడ్లకి ఎక్కడం లేదు. చాలా డల్ స్టూడెంట్స్. ఈసారి ఫుల్ రిజల్ట్స్ రావడం కష్టమే" చెప్పాడు రామ్మూర్తి ఏకంతంగా వున్న హెచ్.ఎమ్.తో.

"అలా అయితే ఓ పని చేయండి. మన స్టూడెంట్స్ ఎగ్జామ్ రాసే సెంటర్ లోని స్టాఫ్ టీచర్స్‌కి పెద్ద పార్టీ అరేంజ్ చేయండి. అదంతా వాళ్లే చూసుకుంటారు" దీనికింత వర్రీ ఎందుకన్నట్లు చెప్పాడు హెడ్మాస్టర్.

"సార్! మరి ఆ పార్టీకయ్యే ఎమౌంట్"

"ఫిఫ్త్ సెప్టెంబర్ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకి మీ పేరు ప్రపోజల్ చేసిన లెటర్ అందరి సంతకాలతో పూర్తి చేయించి ప్రభుత్వానికి పంపబోతున్నానుగా. మరి ఆ పార్టీ విషయం మీరు చూసుకోలేరా?" సూటిగా అడిగాడు.

"ఓకే సార్. ఓకే సార్" అంటూ తోకాడిస్తూ రామ్మూర్తి వెళ్ళిపోయాడు.

***

ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల్లో, ఆ సంవత్సరం ఆ అవార్డు పొందినవారిలో ఒకడిగా రామ్మూర్తి పేరుని పేపర్‌లో చూసి అవాక్కయ్యారు అతని శిష్యులు, వారి పేరెంట్స్!

(16.5.1997)

*